


శ్రీ వాసుదేవరావు గారు

ఇది మా పెండ్లికి పూర్వం జరిగినవిషయం. చైత్ర మాసం. పగలు రెండుజాములై వుంటుంది. బి. ఏ. పరీక్షలు జరిగి కొన్నాళ్లే అయినవి. నాకు చదివేపని వుండలేదు. అప్పుడే భోజనంచేసి నాగదిలో 'ఈజీఛేర్'లో మేను వాల్చాను. నా చేతులో సంస్కృత 'అభిజ్ఞాన శాకుంతల' ముంది. ఈశాకుంతలను నేను చదవటమిది యెన శైతోమ్మిదోసారి. పరీక్షలకైతేనేమి — ఆగ్రంథంలో వున్న స్వారస్యాన్నిబట్టి యేమి — నాకు దానియందూ, దాని రచించిన మహాకవియందూ వున్న అభిమానాన్నిబట్టియేమి — ఏలాగైతేనేమి? — ఆ గ్రంథమంతా కంఠపాఠం చేయాలెనని ఆశకలిగింది. చాలావరకూ ఆలాగే చేశానుకూడాను. ఆమాయూలును అనుసరించే ఈనాడు కూడా వల్లేవేస్తూన్నాను. కణ్వమహర్షి శకుంతలను దుష్యంతుని రాజ్యానికి పంపిస్తూ ఆమెకు ఉపదేశం చేస్తూన్న పట్టులో వున్నాను. ఒక్క శ్లోకంలోని భావం నాలోనే ఆలోచిస్తూ కళ్లుమూసికొని వున్నాను. అంతలో మా అమ్మ నన్ను పిలుస్తూ గదిలోకి వచ్చింది. మా అమ్మయెదుట నేనెప్పుడూ కాళ్లుచాచుకుని కుర్చీలో పడివుండడమెరగను. లేచి సరిగా కూర్చొన్నాను. ఆమె చేతిలో ఒక జాబుంది. చూచాను.

"ఏమమ్మా? ఎక్కడిదాజాబు? మామయ్య వ్రాసిందేనా!" అని నేనడిగినాను. ఆజాబు మామయ్య వ్రాసిందే అని నాకు బాగా తెలుసును. ఈమధ్య ఆయన తరుచుగా వ్రాస్తూన్నాడు.

"అఁ, పరీక్షలుకూడా ముగిసినవికదా. ఇంకా అలస్యమెందుకురా బాబూ? ఈ రెండు నెలలబట్టీ పరీక్ష



"ఏమమ్మా?ఎక్కడిదాజాబు? మామయ్య వ్రాసిందేనా!"
అని నేనడిగినాను.

రోజులనీ – చదవవలెననీ – ఏవేవో చెప్పి కాలక్షేపం చేశావు. ఇప్పుడన్ని ఆటంకాలూ తీరినవి కదా. ఇప్పుడేదో వకటి నిశ్చయం చేసుకుందూ" అని మా అమ్మ జాలికలిగేలా గన్నది.

"కానీలే, ఇప్పుడంత తొందరేమి వచ్చింది? కానీలే. ఈ బీ. ఏ. ఫలితం తెలిసినతర్వాత యం. ఏ., కావాలికదా-అదికూడాకానీ—."

"నీవీలా గంటావు. అన్నయ్య చూడబోతే వుత్తరాలమీద వుత్తరాలు వ్రాస్తూంటాడు. సంబంధం మంచిది. నీయిష్టానుకూలం. మించిపోతుందేమో అని ఆయనకుభయం. చూస్తూ, ఇంత పెద్దపిల్ల నెవరైనా పెండ్లి చేయకుండా వుంచుతారా? ఇంతకాలంనుంచీ నువ్వు చిన్నపిల్లను చేసుకోనని పట్టుపట్టినావు. నాకుం మావాళ్ళకుం యిష్టంలేనిపని చేస్తానన్నావు. శాస్త్రాధారాలు చూపినావు. ఎంతో ఆలోచించి విద్యాసాగరుసంత వానితల్లి కేవలం శాస్త్రాధారాలు విని వితంతూద్వాహానికి సమ్మతి యిచ్చివుండగా మూర్ఖురాలిని నేను మాత్రం నసౌఖ్యానికి భంగమందుకు కలిగించాలెనా అనుకుని అన్నయ్యతో చెప్పి అందరినీ మెప్పించి నీ యిష్టానుసారం రజస్వలానంతరవివాహానికి సమ్మతించానుగదా. ఇప్పుడు నీవు, నీ అపేక్షలకు, తగినపిల్ల దొరికివుండగా యింకా 'కానీలే' నా? ఈకాలంవాళ్లు మీరు. పోనీలే-మీయిష్టాల కనుకూలంగానే ప్రవర్తిస్తామని నిశ్చయించి యింతవరకూ వూరకున్నాను. నీ'కానీలే' చెల్లించాను. అప్పటి నీకారణాలు బాగానే వుండేవి. ఇంకా 'కానీలే' యేనా? ఇంక నీ 'కానీ' చెల్లదు. నీయీడువాళ్ళంతా పెండ్లిండ్లు చేసికొని ముద్దుముచ్చటగా కాపరాలు చేస్తూంటే-ఇదేమి నాకర్మమూ అని నాకెంత దుఃఖమౌతున్నదో నీకెందుకు తెలియదా అనుకుంటాను. పెద్దదాననుగదా-ఇంకెంతకాలమని బతికి వుంటాను? ఒక్క యింటివాణ్ణి చేసి చూచినతరువాత ఏలాగైనా మంచిదే అని నేనహోరాత్రాలూ పరితపిస్తూంటే-ఇప్పటికైనా నీ 'కానీలే'కు అంతంలేదు కదా. కాదు-బాబూ, ఇప్పుడు నీమాటలు వినను చూడు. ఈజాబులో అన్నయ్య ఆపిల్ల నెంతగ వర్ణించాడో. నీకూ-నీ అపేక్షలకూ తగినపిల్లే." అని సంభ్రమ సంతోష విషాదాలతో నన్నది.

మా అమ్మయేకారణం చేతనైనా కోపంతోగాని విచారంతోగాని వుండటంతోటే ఆమెను సంతోషపెట్టడానికి నేను పరిహాసం ప్రారంభించే వాణ్ణి. ఆవిధంగానే యిప్పుడుకూడా పరిహాసానికే దిగినాను. మరేమి చెప్పినా లాభముండదని ఆమె కంఠస్వరాన్ని బట్టి కన్నీటిని బట్టి నేను తెలిసికొన్నాను. పరిహాసంవల్ల సంతోషిస్తుందా అని నాకనుమానం కలిగింది. అయినా ప్రయత్నం చేసి చూదాము. అంతగా పట్టుపట్టితే చూదామని నిశ్చయించాను. 'ఆపిల్లని యెంతగా వర్ణించాడో చూడు' అని మా అమ్మ అనడంతోటే నాకు నవ్వు వచ్చింది. ఈ వర్ణనలు నేడు క్రొత్తలుకావు. ప్రతివుత్తరంలోను ఉన్నవే. అయినా ఈపూటవచ్చిన జాబులో ఇంకా విశేషాలేమి వర్ణించాడో విందామనుకున్నాను.

"ఏమి వర్ణించాడు మామయ్య?" అని ఆత్రంతో అడిగినాను.

"పిల్లని వర్ణించాడు" అన్నది అమ్మ.

"ఏదీ వినిపించు" అన్నాను.

"నీవే చదువుకో" అని అమ్మ జాబు నాకీయవచ్చింది.

నాకు తెలుగుజాబులు చదువుతుంటే యెంతో కష్టంగావుండేది. నేను నిజాం రాష్ట్రంలో వుండడంచేత నేనక్కడివాడనే అనిపించుకోవడంలో అభిమానంగావుండేది. 'ఆంధ్రుడైవుండి తెలుగంటే అసహ్యించుకొనేవాడు' అని నన్ను దూషించేవారు మావారు. అదీ నాకభిమానంగానే వుండేది. అమ్మకు ఇంగ్లీషు రాదని యెంతోకష్టంతో అమ్మతో మాత్రమే తెలుగు మాట్లాడేవాడను. యథార్థం చెప్పుతున్నాను. ఎందరికి కోపం వచ్చినా యథార్థవాదినని క్షమించండి!

మా అమ్మతో నేను 'నీవే చదువుమా' అన్నాను.

"అయితే, విను" అని మా అమ్మ జాబు చదువ సాగింది.

"ఈసారియును జారవలదు. రాబోవు, ప్రథమ ముహూర్తమున ముడిపెట్టక తప్పదు. ఇంతకన్నను చక్కనిసంబంధమిక—"

అంతలో నేను "ఈరోకటిపాట వినీవినీ విసుగు పుట్టింది. ఆవర్ణనలేమిటో అవిమాత్రం వినిపిస్తూ—" అన్నాను.

"విను" అని నిలిపినచోటు మొదలుకొని చదువ సాగింది. "మన అబ్బాయికి దుర్లభము—"

"ఆహాహాహా! దుర్లభమేమిటి? దొరకనే దొరకదంటూ" అనినవ్వాను. "ఆ—వర్ణనలు చదవమ్మా!" అన్నాను.

మా అమ్మ చదవింది.

"'గుణవతి'—"

"చిత్రాంగివంటి—"అన్నాను.

"సీ- విందూ, 'విద్యావతి'—"

"ఆహాహా! అపరసరస్వతీ!"

"మూస్కో నోరు, 'వయోవతీ'—"

"శతవత్సరపూర్ణ—"

"చాలించు నీవాగుడు. నాలుకకడ్డం లేదుకదా. 'శీలవతి'—"

"ఆహాహా! అహల్యా, తార—"

"బాబూ, బాబూ! నీపాండిత్యం ముదిరిపోతున్నదే."

"అమ్మా, మామయ్యకంటే పండితుడనా? చూడు ఎన్ని 'వతీ' లేరితీశాడో. పోనీలే! పోనీలే! ఇంకా యెన్ని 'వతీ' లున్నవో చదువు" అన్నాను.

అమ్మకు కోపంవచ్చింది. అంతలోనే నవ్వు తెచ్చుకుంది. జాబుమడిచింది. "ఎగతాళికి వేళా కాలాలుండేనా?" అన్నది.

"అమ్మా, లేదులే. ఇంకా యేమున్నదో చదువు" అనిబతిమాలినాను.

"మంచీ చెడ్డా తెలీక యెల్లకాలం పిచ్చిపిచ్చిగ వేళాకోళా లాడే నీనోట్ల చదవడం కూడానా?" అని మెల్లగ మందలించి మాయమ్మ జాబు మడత విప్పి చదవ సాగింది. "వినయవతీ"—

నేను బిగ్గరగా నవ్వుతూ "అమ్మా, నాకీపిల్లవద్దు బాబో" అని అన్నాను.

"ఎందుకు బాబూ? వినయం నీకు పనికిరాదా యేమిటే?" అన్నది అమ్మ.

"'అతివినయం ధూర్తలక్షణం' కాదా?"అన్నాను.

"నీపాండిత్యం ముదిరి పాకాన బడుతున్నదే! అయినా నీకీలాటిదే కావాలె. అప్పటికిగాని నీకు బుద్ధి రాదు. 'విను రూపవతి—'"

"ఇంకెందుకమ్మా? ఇంకేమికావాలె, నేనీపిల్ల నేమాత్రం చేసుకోను. 'భార్యా రూపవతీ శత్రుః' అన్నాడు హితోపదేశకుడు. ఇంకా కొంతకాలం నన్నీలాగే బ్రతికివుండనీ—"

"ఛేఛే-నేనన్నట్లు నీలో అర్థపండిత లక్షణా లన్నీ నిండివున్నవి. మాటకుమాటకూ వెక్కిరింపులేనా? నీచదువంతా పెడతోవ పట్టుతున్నది"

"అమ్మా, మాటిమాటికీ పండితుడవూ, అర్థ పండితుడవూ అని నన్నెప్పుడూ అంటూవుంటావు. పండిత వంశంలో పుట్టినాను. తండ్రి వేపువారూ పండితులు, తల్లి వేపువారూ పండితులు. నిదర్శనం నీవూ మామయ్య. నీవు పెద్దపెద్ద 'లెక్చ'ర్లిస్తావు; బి. ఏ., చదివినవాడికి నాకు నీతులు నేర్పుతావు; పండితుడవని పోటుమాట లంటావు. ఇంక మామయ్యా, కూడు-ప్రతిజాబులోనూ వ్యాకరణ యుక్తంగా వ్రాస్తాడు. పెద్దపెద్ద సమాసాలు పెడతాడు; నిఘంటువు లన్నీ తిప్పి తిప్పి డెబ్బైయారు 'వతీలు' పెడతాడు. రెండు వేపులవారూ పండితులు. నేనుమాత్రం పండితుణ్నెందుకు కాకూడదు? మాలోవిశేషం నాలో, వాళ్ళకెవరికీ నింగ్లీషురాదు. ఒక్క తెలుగు సంస్కృతం తప్ప వేరె భాషరాదు. నాకో - యెన్ని భాషలు వచ్చునో చూడు. కాబట్టి నేను వాళ్ళందరి కంటేను గొప్పపండితుడను. ఇంకా యింతకంటే నెక్కుతాను యం. ఏ., కాని—"

"ఆఁ, సరిపోయింది. యం.ఏ. అయితే పూర్ణపండితుడవు. అయితే యిప్పటికి అర్థపండితుడవనే వప్పుకున్నావు. కాబట్టే యీలాటి పిచ్చిమాట లొస్తూన్నవి నోట."

"అవుతాను పూర్ణపండితుడను. పోనీలే – ఈ వాదన యెందుకుగాని – అమ్మా! మామయ్య ఆపిల్ల పేరేమన్నాడు?"

"మనోహరియట."

"నయమే. ప్రాణహరి కాదుకదా! గుడ్డిలో మెల్లశ్రేష్ఠం."

"అయితే, బాబూ, నువ్వేమంటావు? పిల్లను చూడడాని కెప్పుడు బయలుదేరుతావు?"

"ఇప్పుడు చెప్పాలసిందేనా."

"ఆఁ, ఇప్పుడు చెప్పాలసిందే. ఇంక నేనాలస్యం వోర్చుకోను. ఏదోవకటి యీపూట-యిప్పుడే- తేలాలే. "సౌఖ్యమో మోక్షమో తేలియాలె." అని మా అమ్మ ఖండితంగా- నిర్మొగమాటంగా- అన్నది.

ఇప్పుడేమిచేయాలె? యం. ఏ. అయ్యేవరకూ పెండ్లివద్దని నాకు, చేసుకొంటేనేగాని కాదని మాఅమ్మకు. ఆమెచెప్పిన కారణాలు బాగానేవున్నవి. నాకారణాలూ బాగానేవున్నవి. ఏమిచేయాలె? అయినా యింకాకొంతవరకూ వాదిస్తామని తలచినాను.

"అమ్మా, నీవిప్పుడు యింత గట్టిపట్టుపట్టినావు. కాబట్టి నామనసు విప్పి చెప్పుతూ న్నాను. విను-"

"ఆఁ. ఈపూట కొత్తవేమి సృష్టించావు? అన్నీ వినివినీ విసుకు పుట్టినవేనా? ఇంకానువ్వు చెప్పనూవద్దూ- నేను—"

"అదికాదు. కొత్తవేమిలేవు. చెప్పినదే నాలుగైదుసార్లు చెప్పితే చక్కగా బోధపడుతుంది. ఆలోచనలో దిగుతుంది, సరైనమార్గానికి వస్తుంది. విను. పెండ్లి వంటి మహాపవిత్రకార్యంలో, జీవితకాలమంతా తోడు నీడలుగా సంసారయాత్ర జరుపవలసినవారిని యేలుకోవడంలో- అంతరంగాని, యితరులు జోక్యం గలిగించుకోవడంలో గాని, అర్థంలేదు. మధ్యవర్తులు- ఎవరైతే మాత్రమేమి?- పనికిరారు. ఎందుకంటావా, నూరు బొంకులైనా బొంకి ఒక్కముడిపెట్టమన్న శాస్త్రం వారికాధారం. అదియేమాత్రమూ పనికిరాదు. అలాటివారికి ముడిపెట్టడమంటేనే అర్థంతెలియదు. డబ్బుముడిపెట్టమనే వాళ్ళభావం. తరువాత, పదిమందీ కలుసుకోవడం. మంచి మంచి నగలూ బట్టలూ ధరించడం- బాజాబజంత్రీలు- మేళతాళాలు- విందులూ పిండివంటలు- పల్లకీలలో వూరేగింపులు- సంబరం- ఇంతకంటే మరేమీ వాళ్ళకి తెలీదు. అందులోనూ మామయ్య విషయం నీకూ తెలియందికాదు. డబ్బుకిప్రాణాలిస్తాడు. ఆయనఒక్కడబ్బును మాత్రమే చూస్తాడు. అదుంటేచాలు. తక్కిన అన్ని అవలక్షణాలూ మాసిపోతవి. పిల్లతండ్రి ధనవంతుడున్నాడు; తనకు బాల్యస్నేహితుడూ సహపాఠీ అన్నాడు. ఈకారణాలే ఆయనకుచాలు. మొగమోటం- ఇష్టమైంది. అంతగా వర్ణించాడు"

"అయిదువేలేనా కట్నమిస్తాడంట—" అని మా అమ్మ తటాలుననన్నది.

నాకోపలు భగ్గున మండింది.

"అమ్మా! నాకు పనికిరాదు. అయిదువేలేనా యిస్తాడు—పదేనువేలేనా యిస్తాడు. కాని యెవరికి కావాలి? ఆ అయిదువేల కాసించి యేహిడింబినో- యే శూర్పణఖనో- యేపూతననో-కట్టుకోమన్నావా? ఆహా! నీవు నిజంగా ఆ అన్నయ్యకు తగిన చెల్లెలివే! నేను మామయ్యను దూషిస్తూన్నాను అని కోప్పడవద్దు. యథార్థంచెపుతూన్నాను. ఆయన మహాలోభి; ఒక్కడబ్బును మాత్రమే చూస్తాడు. తక్కినవేవీ ఆయనకు కనబడవు. నాకుడబ్బువద్దు. పిల్లపేదదైనాసరే. పెద్దదై వుండాలె. నామనసుకు నచ్చాలె. మా మామయ్య చూచాడంటే- చూచాడు. మామయ్యకళ్లు నా కళ్లుకావు. మామయ్య కాంక్షలు నాకాంక్షలుకావు. నారుచులు మామయ్య రుచులుకావు. ఒక్కొక్కడికి ఒక్కొక్కటి యిష్టం. మామయ్యయందు నాకు నమ్మకంలేదు. అందులోనూ యీవిషయంలో నాకు బొత్తుగా నమ్మకంలేదు—"

"నమ్మకమని నేనుమాత్ర మన్నానా? కాబట్టి నీవు స్వయంగావెళ్లి చూచిరా. ఇష్టమైతే చేసుకో- లేకుంటే మానేయి. ఇందులో తప్పేముంది? పిల్ల హార్మోనియం- వీణా వాయిస్తుందట. మెట్టికేశం దాకా చిగుపుకుందట. కుట్టుపనులూ చేస్తుందట. ఈకాలంవాళ్లకి కావలసిందదేనా! ఇన్నిలక్షణాలూ నీయిష్టప్రకారంగా వున్నపిల్లనే చూచాడు గాని అన్నయ్య—"

"అదే చెప్పాను కాదమ్మా. మామయ్య కళ్లు నాకళ్లుకావు. నారుచులు మామయ్యరుచులూకావు. తరువాత యింకాకొన్ని విషయాలూ ఆలోచించుకోవాలె. ఈపిల్ల చూడబోతే కన్నడదేశంలో వుందిప్పుడు. అక్కడి ఆకన్నడదేశాచారవ్యవహారాలే పట్టుబడి వుంటవి—"

"ఇక్కడి యీ హైద్రాబాదీ తురకాచార వ్యవహారాలు పట్టుబడలేదా—" అని నవ్వింది అమ్మ.

"ఆఁ, అవును. తనమనసును బట్టే యెదటివారి మనస్సులు తెలుసుకోవాలె. నాకింగ్లీషువాళ్ళ డ్రెస్సు నచ్చినట్టు ఆపిల్లకు అక్కడివాళ్ళలాగ డ్రెస్సే అభ్యాసమై వుంటుంది. కుంభకోణం, కంచీ, సేలం, మధురా, కొర్నాటి పట్టుచీరలే రోజూ కట్టుచీరలు. జత ఒక్కంటికి డెబ్భై యెనభై—"

"నీదేమి మునిగింది? నీవు మాత్రం పెట్టడంలేదా- ఒక్క 'నూటు' కు అరవై దెబ్భైలా? 'నెక్ టైలూ కాల్లర్లకే బోలెడు పోస్తున్నావే! అలాగే! నాకాలాటిదే కోడలు కావాలె." అని అమ్మ నిశ్చయ పూర్వకంగా అన్నది.

"ఇప్పుడింత కర్చుపెట్టి చదువుతున్నాను. పైన సంపాదన యేముంటుందో. ఇంకా యింగ్లండుకు వెళ్ళి 'సివిల్ సర్వీసు'కు చదవాలె ననుకుంటున్నాను. ఉండనీ పైగా పిల్ల చదువుకున్నదన్నావు. ఆలేసులకూ, ఆజా కెట్లకూ, ఆకాస్మెటిక్కులకూ, ఆఫేజ్ పౌడర్లకూ- అన్నిటికీ డబ్బుగల్ల చదువుకున్న పిల్ల సంసారం దిద్దుకోవడ మెరగదు——"

"అబ్బబ్బబ్బా! నీ వుపన్యాసా లింక చాలించు. ఆడవాళ్ళకు చదువు కావలెనో అని మొరపెట్టేవాడివే- స్వంతవిషయంలో ఈలాటి అనుమానాలా?"

"నిజమే-చదువుకావాలె; ఇప్పుడుమాత్రం నేను వద్దన్నానా?"

"ఇంక నీమాట చాలించు ఏమైనాసరే; నాకీ పిల్లే కోడలు కావాలె. నాకోడలు - నీడబ్బు వద్దు, నీవు పన్యాసాలూవద్దు-నా యింటి దీపం, నాగృహలక్ష్మి. నాకీలాటిదే - యిదే-కోడలుకావాలె. నువ్వు నీడబ్బును ముడివేసికొని చూడు. నాకిష్టమైనంత నాకోడలికోసం కర్చు పెడతాను. రోజూ 'శికా'ర్లకు తీసికెళతాను. అప్పుడు నీవేం చేస్తావో చూదాము. ముందుగా తెచ్చి నాకప్పజెప్పుమా" అన్నది అమ్మ మహానంద సంభ్రమం తోటి.

నాకు నవ్వువచ్చింది. నిజంగా అలాచేసేదే మా అమ్మ. ఆమెకంత సంబర మున్నప్పుడు - అన్నికోర్కెలున్నప్పుడు-ఎందుకు తీర్చక పోవాలెనా అనిపించింది నామనసు. నాకళ్ళు నిండివచ్చినవి! జోటజోట నాలుగు బొట్లు చెంపలమాదికి జారివచ్చినవి. ఇవి కృతజ్ఞతా నందా శ్రువులుకావా? మాఅమ్మ యందునాకు మహాభిమానం. ఎప్పుడూ నేనామె ఆజ్ఞలు మీరి యెరగను. ఆమెకూడా నామనసును గుర్తించే నడచుకొనేది. ఇప్పుడా అభిమానం మరింతగాఢంగా నాటుకున్నది. ఇంక నీవిషయంలో కూడా మీరరాదని నిశ్చయించుకున్నాను. ఆమె కోర్కె యీడేర్చ వలసిందే-తప్పదు.

నాకన్నీరుచూచి అమ్మకూడా కన్నీరుకార్చింది. లేచి నావగ్గరికివచ్చి కన్నీళ్లుతుడిచి ప్రేమతో "బాబూ, నాయీకోర్కె తీర్చవూ? నీవు యం.ఏ., అయ్యేదాకా ఆగుదును గాని యిప్పటికే పిల్ల పదారేండ్లది. అన్ని విషయాల్లోనూ నీకు అనుకూలంగా వున్నది. ఇప్పుడు మించితే యింకా రెండేండ్లదాకా ఆపిల్ల నుంచుతారా? నీవంటి సంస్కర్త లిప్పుడెంతరు బయలుదేరారో! ఆపిల్ల కోస మిప్పుడే యెన్ని పోటీలున్నవో. ఇవన్నీ ఆలోచించే యీమాట నే నీపట్టు పట్టినాను. మరే ఆలోచనాచేయక వెళ్ళిచూచి నచ్చితే తెచ్చి నాకప్పజెప్పు. అన్నిటికీ నేనున్నానుగదా!" అన్నది.

ఇంక తప్పదు. అప్పటికీ నాపరిహాసప్రియస్వభావమన్నూ పసల లేదు.

"సరే. నీకిష్టమేలాగో అలాగేకానీ. వెళ్లి, ఆబరువును మోసుకునివచ్చి నీమీద విసరేస్తాను. ఏంజేసుకుంటావో,తరువాత, చేసుకో; కానీ అమ్మా, ఇప్పుడే ముందుగా చెప్పుతున్నాను; ఆలోచించుకో మీయిద్దరిలో నేవైనమనస్తాపాలూ, కలహాలూ, కలిగినవా, నేను మాత్రం బ్రహ్మచర్యంగా నున్నగా గొరిగించుకొని యీ మీసాలుగడ్డానికి తిలవచ్చి కాషాయవస్త్రాలువేసి కొని 'జై పరమేశ్వరా' అని కాశీ,రామేశ్వరం, ప్రయాగ మొదలైన దివ్యక్షేత్రాలకి వెళ్లిపోతాను——" అనినేనూ నవ్వినాను.

అమ్మ వణికింది. మొగం నిస్తేజ మైంది. కళ్లుటపటపమని నీళ్లుకార్చినవి. మళ్లీ నాదగ్గరికివచ్చి మాఅమ్మ మృదుస్వరంతో "కానీలే- అప్పటిమాట లిప్పుడెందుకూ! అయినా పెద్దదానను — దీవిస్తూన్నాను. మీరిద్దరూ సుఖం సంతోషంతో కాపురం చేస్తూంటే నాలుగు రోజులు చూచి సుఖంతో నేనూ కళ్లుమూసుకొంటాను. నీకు మంచి భార్యదొరకాలెనని యీ బ్రహ్మాండమైన సంసారసాగరం సంతోషనౌకలో సుఖంగాప్రయాణం చేయడానికి మిమ్ముల దీవించుమని పరమేశ్వరుని ప్రార్థిస్తూన్నాను." అంటూతనకుడిచేయి నాతలమీదపెట్టి దీవించింది. ఆహస్తం వరదహస్తమే !

నేను నాలోనే అనేకవిధాలాకృతజ్ఞతను తెలది పరమానందం పొందినాను. అప్పుడు మా అమ్మవంటి

అమ్మలు లోకంలో మరెవ్వరికీ లేదనుకున్నాను. ఈలాటి అమ్మకడుపులో పుట్టినందుకు నేను ధన్యుణ్ణి అనుకున్నాను. ఆమె కోర్కె తీర్చడానికి సంకల్పించుకున్నాను.

నిజానికేమిగాని నాకిప్పట్లో పెండ్లి యిష్టం లేదు. యం. ఏ., అయ్యేదాకా చేసుకో కూడదని నామతం. భార్యను సకలవిధాలా భరించడానికి శక్తికలిగి యితరుల సహాయ మేమాత్ర మపేక్షించకుండా స్వతంత్రంగా సంపాదించే శక్తి కలిగేవరకూ పెండ్లి మాటే తలపెట్టకూడదని నా అభిప్రాయం. ఆలాగే అమ్మతో యెన్నివిధాలో చెప్పినాను. ఇప్పటికి నాల్గేండ్లవరకూ కాలక్షేపంచేశాను. నాకుడబ్బులేకపోలేదు. కాని, యెంతైనా పిత్రార్జితమేకదా! ఇప్పుడు నా ఆలోచనలన్నీ కట్టిపెట్టాను. అమ్మమాట తోసేయలేను. ఇప్పుడు పరీక్షకూడా అయింది. ఆమె యిందాక చెప్పినకారణాలు బాగావున్నవి. నిజమే, అంతధైర్యంచేసి పిల్లను పదారేండ్లవరకూ పెండ్లిచేయకుండా పెంచేవారు అరుదు. నిజంగానే నావంటివాళ్లెందరో బయలుదేరివుంటారు. ఇప్పుడు నేనొప్పితే మామయ్యను అమ్మనూ సంతోషపెట్టినవాణ్ణి అవుతా. ఇంకా అనేకవిధాలా ఆలోచిస్తున్నాను. ఇంతలో అమ్మ-

"ఏమిరా బాబూ! మౌనంవహించినావు? ఏమంటావు?" అనిఅన్నది.

నేను "సరే, నీయిష్టప్రకారమేకానీ అమ్మా" అన్నాను.

"అయితే యెప్పుడు బయలుదేరుతావు?" అనిపట్టరాని సంతోషంతో అన్నది అమ్మ.

"రేపు బయలుదేరుతాను బళ్లారికి-" అన్నాను.

"రేపే? బాబూ, అన్నయ్య యీజాబులో యేం వ్రాశాడో చూచావా? పిల్ల బళ్లారిలో లేదట, పెద్దన్నయ్యగారు బెజవాడకు తీసుకొచ్చారట మనకు దగ్గరేకదా. బెజవాడకువెళ్లిరా"

"అమ్మా, పూల అందం చెట్లమీదనే చూడాలె. వ్యాఘ్రరూపం పౌరుషం అడవిలోనే చూడాలె. చంటిబిడ్డల ముద్దులూ మురిపాలూ తల్లి వళ్లోనేచూడాలె. ఏదేశంలోవారిని ఆదేశంలోనేచూడాలె. అప్పటికిగాని నిజమైన విలువ తెలియదు, అంతేకాకుండా పిల్లను వకళ్ల యింట్లో చూడడం బాగుండదు. అన్నయ్య అయితే మాత్రమేమి? తల్లితండ్రులవద్ద వున్నట్టుంటుందా అక్కడ స్వతంత్రం? ఏదోఒకటిరెండు మాటలాడవలసి వస్తుందనుకో- అన్నలయెదటా వదినెల యెదటా పిల్లలు సిగ్గుపడుతారు. అందులోనూ వదిన అంటే యింక పరిహాసానికేం తక్కువుంటుంది? పిల్లమనసూ రుచీ తెలిసికోవడం కష్టం - ప్రాణాంతంవరకూ వున్నసంబంధం- ఎడతెగని సహవాసం- వారిమనసులు కుదరకపోతే యేం లాభం? అమ్మా, పెండ్లి విషయంలో నామతం విచిత్రమైంది. అపరపక్షం మూడునాలుగు రోజులైనా పట్టుతుంది మనసులు కలియడానికి. ఒక్కసారి చూస్తే చాలదు. తొలిచూపుతో పుట్టేవలపు మోసం - అదే మాయ. అది వలపుకాదు. భ్రమ. ప్రేమగానే కనపడుతుంది. ఏవిధంగా ఒక్కసారే వలపు కలుగుతుందో ఆవిధంగానే నశింపు. ప్రేమ క్రమంగా వృద్ధికావాలె. అదే నిజమైనప్రేమ. ప్రతిఫలాపేక్ష వుండదు. స్వార్థం వుండదు. ఈర్ష్యాసూయలుండవు. కాబట్టి కాబోయే భార్యాభర్తలు అపరపక్షం నాలుగైదు రోజులయినా తరుచుగా ఒండొకళ్లను చూస్తూవుండి మాట్లాడుకుంటూ వుంటేమంచిది. కాబట్టి, నేను రేపే బళ్లారికి పయనమవుతాను" అని నేను నిశ్చయాత్మకంతో అన్నాను.

నాయీమాటలన్ని మాయమ్మ చిరునవ్వు నవ్వుతూవిన్నది. కడకు 'పెద్దవారవైపోయినావే బాబూ' అని అన్నది. "కానీ, నీయిష్టమేలాగున్నదో యీలాగేకానీ- కాని, పిల్ల బెజవాడలో వున్నదికాదా, నీవు బళ్లారికి పోయి చేసేదేముంది?"

నేను గర్వంతో "బెజవాడలో వుండనీ ఢిల్లీలో వుండనీ- రేపురాత్రిబయలుదేరుతున్నానని యీపూటే మామయ్యకు 'టెలిగ్రా' మిస్తాను; మామయ్య పిల్లతండ్రికి తెలుపుతాడు; ఆయన బెజవాడకు 'టెలిగ్రా'మిస్తాడు. వాళ్లూ బళ్లారికి వెళ్తారు- అంతేగాని, ఒకళ్ల యింట్లో నేను పిల్లను చూడను.

"అప్పుడే నీ అల్లుడితనం చూపిస్తూన్నావే- వాళ్లనంత కష్టపెట్టడం నీకు న్యాయమేనా? పిల్లవేపువారనేకాదు వాళ్లకీ ఆయాసం? పిల్లఅక్కడికి వచ్చినప్పుడు

ఇంకా యెన్ని పరీక్షలు చేస్తావో! వాళ్లనింకా యెంత కష్టపెడతావో కదా?" అనినాయమ్మ నవ్వుతూ అన్నది.

"అమ్మా, దేనికమ్మా కష్టం? ఇదీ కష్టమేనా? నాకు కష్టమే ముక్కరలేదు, మరేమీ అక్కరలేదు. ఈ మాత్రం కష్టాలకైనా ఓర్చుకోలేకపోతే మరేలాగా? కష్టమైతేపోనీ- అందుకనే నాకాపిల్ల——"

"వద్దురా బాబూ? నాకాపిల్లే కోడలుకావాలె. ఇంకనైనా నోరుమూసుకొంటూ, నీవు మాత్రమేదేశపు వాడవో?"

"నేనా? నేనా? నేను హైద్రాబాదీ-నక్కనీ! నాహృదయంవేరే- వాళ్లహృదయాలువేరే; నేనూ వాళ్ల వంటి వాణ్ణేఅయితే అయినుకాదు- పదేను వేలిస్తేనే గాని పెళ్లిచేసుకోనని పట్టుపట్టి కూర్చుందును. పెద్ద పెద్ద సభల్లో నేనెకలమీదనెక్కి సంఘసంస్కర్తలని పేరుపెట్టుకొని, సంస్కార విషయాలు పెద్దపెద్ద 'లెక్చ' ర్లిచ్చి (బహిరంగంగా) లోలోపల వంపులువేసూ కట్నాలు పుచ్చుకొనే ఆంధ్రబ్రాహ్మణులెక్కడ, నేనెక్కడ? ఈవ్యత్యాసం నీకు కనబడలేదమ్మా?" అని అన్నాను.

"ఆఁ, ఇంక చాలించు నీ ఆత్మస్తుతి? ఇతరులను యేన్నైనా అనవచ్చును,"

"ఆఁ- ఆఁ- నేనన్నదీ అంతే- తనదాకా వచ్చి నప్పుడే మనుష్యుని నిజమైన విలువ తెలుస్తుంది."

"తెలుస్తుందిగా- తొందరెందుకూ? బాబూ, వాళ్లు నిన్నేమైనా అడిగినప్పుడు నెమ్మదిగా జాగ్రతగా జవాబిస్తూవుండు. ఇక్కడ నాదగ్గర మాట్లాడినట్లు పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. హైద్రాబాదీ బడాయీలు చూపకూ."

"నన్నేమడగాలె వారు? వారు నన్నడగవలసిందేముంటుంది? నాకుతెలీని దేముంటుంది? ఇంతపెద్ద 'బి. ఏ' ను కాదు."

"బి.ఏ., యం. ఏ. అయినంతమాత్రమున నేమి? పేరుకు రెండక్షరాలు తగిలించుకోడానికి పని కొస్తుందిగాని, లోకజ్ఞానం కలగద్దూ? అందుకు మీ పుస్తకాలూ పుస్తకాలూ పనికిరావు; అనుభవంకావాలె. మంచి స్వభావం, శీలం, సభ్యత్వం, మర్యాద, అణకువ, ఇవన్నీ కావాలె లోకం మెచ్చడానికి."

"అమ్మా, అమ్మా! నీకుకూడా ఆ ఆంధ్రబ్రాహ్మణుల స్వభావమే పట్టుపడ్డదే. మీ వంశంలో నీవొక్కతెవే తప్పపుట్టినావనుకున్నాను. ఆంధ్రబ్రాహ్మణులవలె పెద్దపెద్దవుపన్యాసా లిచ్చేగుణం నీకుకూడావున్నదే!" అని నవ్వి నేను "పోనీలే-ఆలస్యమెందుకు? వెళ్లి 'టెలిగ్రా' మిచ్చివస్తాను- 'టైం' అవుతూవుంది."

"ఏమని? ఎవరికి?"

"మామయ్యకు- రేపు బళ్లారికి వెళ్లుతున్నానని 'టెలిగ్రా' మిచ్చి బళ్లారికి తెలియజేయాలెనని-"

"రేపే? రేపే బయలుదేరుతావా? బాబూ, పిల్లనుమాసి జ్యోష్ఠమాసపు- సంబంధం కుదుర్చుకునే వాళ్లవు. మంచి రోజు చూచి బయలుదేరుదువు."

"అమ్మా, నీకింకా యీకాలపు నాగరికత అలవడకుండా పాతకాలపు మాటలు మాట్లాడుతూన్నావే. మంచిరోజేమిటి? మంచిరోజని చెడ్డరోజని భగవంతుడు వేరేవేరే సృష్టించాడా! అన్నీ మంచిరోజులే. మనప్రయత్నాలనుబట్టే, మనపట్టుదలనుబట్టే లాభాలాభాలు కలుగ తనేకాని రోజేంచేస్తుంది?——"

"ఇదే మూర్ఖం- ఈకాలపు యీపాడు చదువుల వల్లపుట్టే దుర్బుద్ధులు- శాస్త్రాలంటే ఒప్పరు- జ్యోతిషం——"

"ఆమాటనకు; నాకు శాస్త్రాల్లో నమ్మకం లేకపోలేదు. మూలశాస్త్రాలు శ్రేష్ఠమైనవే; కాని, శాస్త్ర పండితులమని శాలువలు కప్పుకుని, కుండలాలు తగిలించుకుని, శాస్త్రాల కపార్థాలు కల్పించి, ఆచారాలన్నీ పాడుచేస్తూ, పొట్టకోసం తిప్పలుపడే వారివల్ల శాస్త్రాలు చెడిపోయినవి. అందువల్ల నమ్మకం లేకపోయింది.పోనీ, మంచిరోజనీ, మంచిలగ్నమనీ, పంచాంగాలుతిప్పితిప్పి, మీనమేషాలు లెక్కపెట్టి, మంచిముహూర్తాల్లో చేసిన పనులన్నీ బాగానేవున్నవా? అన్నీ ఆటంకాలు లేకుండా - కష్టాలులేకుండా - శుభప్రదంగానే జరుగుతూన్నవా? మనమెన్నిచూస్తూండలేదు వ్యతిరేకాలు. ఏదో

నా మంచిపని చేయాలేనని భగవంతుడు చెప్పుతూ మనసు పుట్టిస్తాడో అదే మంచి ముహూర్తం- అదే మంచిరోజు."

"ఓరి బాబో, యెంతటి శాస్త్రం నేర్చి బయలు దేరావు! బాబూ, నీ యిష్టం మొల్లోకాని- వెళ్తావనూ?"

ఇంతలో గడియారం నాలుగు కొట్టింది.

"అమ్మా, 'టైం' అయింది- మా మామయ్యకు 'టెలి గ్రాం' ఇచ్చి వస్తాను-"

అని లేచి డ్రెస్సు వేసుకుని పోయి మామయ్యకు చేర తంతివార్త యిచ్చివచ్చినాను. ప్రయాణానికి కావలసిన వన్నీ సిద్ధం చేసుకున్నాను. ఆరాత్రి అంతా యింకా యేమేమో నేనూ మా అమ్మ నడిరేయి మించేవరకూ ఆలోచన చేశాము. అనంతరం నాకెప్పుడు నిద్రపట్టిందో నాకు తెలీదు. ఆ నిద్రలో నానావిధాలా సుస్వప్నములే కన బడినవి.

గరుడాద్రి 'ప్రకాశం.'

# బావకత్తె

విశ్వనాథ సత్యనారాయణ గారు

మొల్లపూలంటేను
ముడుసుకుపోతావు
బంతీపూవులంటే
గంతేసి వత్తావు.
ఎంత సోకులాడివే
నీకాడ ఎంత బావమున్న దే.

చన్నీల్లు నామీద
సల్లి నవ్విత్తావు
శీరకొంగట్టితే
శిర్రుబుస్సంటావు.
ఎంత టక్కులాడివే! నీకాడ,
ఎంత బావమున్న దే.

సామివోరికిదణ్ణం
సాస్తూ, నాయెంకేసి
సూత్తూ నవ్వులకళ్లు
సుళ్లు తిప్పేస్తావు.
ఎంత వింతకత్తెవే! నీకాడ,
ఎంత బావమున్న దే.

నిద్దట్లొ నాకేసి
నిలిసి సూత్తుంటావు
దొంగనిద్దుర తెలిశి
దూశిత్తావు నన్ను.
ఎంత చాటుకత్తెవే! నీకాడ
ఎంత బావమున్న దే!

ఈతముల్లూ యిరిగి
యింత నడవనీక
కాలు వాశిందంటే
కంట నీరెట్టావు
ఎంత యింటిదానవే! నీకాడ.
ఎంత బావమున్న దే.

కన్నుల్లో కన్నుంచి
కదిలించి యేస్తావు
నన్ను ముంచేత్తావు
నన్ను తేలుత్తావు.
నీవే నాకు రాణివే! నిను గూడి
నిలుపు నీరయిపోతినే.